# బాసుగాడు!

బాసుగాడంటే ఉగ్ర నరసింహం! నరమాంస భక్షకుడు. తన కిందపనిచేసే సబార్డినేట్స్‌ని పీక్కుతింటాడు!

బాస్ కాలింగ్ బెల్ మోగిందంటే... ఎవరికో మూడిందన్నమాటే! అతగాడొక వర్క్‌హోలిక్. రాత్రింబవళ్ళు ఆఫీసే. వేళకు తిండి తినడు. చాయ్‌లు తాగుతూ పల్లీ పప్పు తింటూ ఫైళ్ళు స్టడీ చేస్తుంటాడు.

నరసింహానికి మరోపేరు కీచకుడు! మనిషి పీనుగులా వున్నా... ఎన్ని ఫైళ్ళనైనా ఒక్కరోజులో స్క్రూటినీ చేసి ఆర్డర్స్ పాస్ చేయగల దిట్ట!

సెక్షన్ నోట్ ఒకపట్టాన నచ్చదు. పేపర్ ఫైలింగ్ ఆర్డర్‌లో లేకపోతే చీల్చి చండాడేస్తాడు.

ఆఫీసులో జీతం తీసుకుంటూ ఆరుగంటలు పనిచేయని స్టాఫ్ అంటే చిరాకు పడతాడు. డిసిప్లిన్... డిసిప్లిన్... అంటూ ఆ మాటను ప్రతివాక్యం చివర ఉచ్చరిస్తాండు.

మహానుభావుడు మిలటరీలో వుండాల్సినవాడు. ఖర్మకాలి మనబారిన పడ్డాడు అనేసి తిట్టుకోనివాడు లేడు.

డిపార్ట్‌మెంట్లో కింద నుండి పైదాకా అతనంటే హడలే! ఉద్యోగుల గుండెలో దడ పుట్టించేస్తాడు.

నరసింహం వంటి నరరూప రాక్షసుడు... క్రూరజంతువులాంటి వాడికింద లెఖ్ఖ! శాడిస్టులు... మానవతా దృష్టి బొత్తిగా లేదు. అతని పద్ధతే అంత!

ఫైలు డిలే అయిందంటే మనిషి ఫైర్ అవుతాడు. నోటింట్ నచ్చకుంటే... పూరీలో కూర నంజుకున్నట్టు... మాటల్తో నమిలి పిప్పి చేస్తాడు.

ఏనాడో మహాపాపం చేసుకుంటేగాని ఇలాంటివాళ్ళ కింద పనిచేయటానికి నోచుకోరు.

బాస్ పొజిషన్లోకి రాగానే అంతవరకు వుండే అవలక్షణాలను వదిలేసి హాయిగా జల్సాగా ఆఫీసర్ పోస్ట్‌తో ఎంజాయ్ చేస్తుంటారు చాలామంది!

కానీ... నరసింహం రూటేవేరు. అతని వర్క్ స్టైలే భిన్నంగా వుంటుంది.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో రాజకీయ నాయకులందరిలో దేశభక్తి మెండుగా అవుపించేది. దేశభక్తి అనే మాటకి రానురాను రాజకీయాల్లో విలువ ఎలాలేకుండా పోయిందో... ప్రమోషనొచ్చి ఆఫీసరైన తర్వాత వర్క్ పట్ల శ్రద్ధ తగ్గి స్వప్రయోజనాలు చూచుకోవటంలో చాలామంది లీనమౌతుంటారు!

కానీ... నరసింహం మాత్రం ఆ కోవకి చెందిన వ్యక్తి కాదు. ఇలాంటివారు డిపార్ట్‌మెంట్‌కే గర్వకారణం.

తనకింద పనిచేసే స్టాఫ్‌కే కాదు. పైవర్గాలవారికీ ఒక పట్టాన కొరుకుడు పడడు! రాజకీయ నాయకుల రికమెండేషనంటేనే నిప్పులు తొక్కిన కోతిలా చిందులేస్తాడు.

ముక్కుసూటి మనిషి! నెలజీతం తప్పించి అర్థపైస కూడా ఎవరినుండి ఆశించడు. మోస్ట్ సిన్సియర్ అండ్ హానెస్ట్ ఆఫీసర్ నరసింహం!

క్యాంపుల వుద్యోగం కాదు కనుక ఛేంబర్‌లో ఛైర్‌కే అంకితమైంది జీవితం!

ఒక కోరిక లేదు... ఒక ఆశలేదు... స్వలాభం చూచుకోడు. పైవాళ్ళ కాళ్ళు పిసకడు... పెద్దవారి వద్ద నిలబడి చేతులు నలపడు!

ఆఫీసులో అందరూ వెళ్ళిపోయినా అర్ధరాత్రి దాటేవరకు ఫైళ్ళలో మునిగి తేలుతూనే వుంటాడు. ఏ అపరాత్రో ఇల్లు గుర్తుకొచ్చి ఆఫీసులో అప్పటివరకు తిరుగుతున్న సీలింగ్‌ఫ్యాన్ల స్విచ్‌లు ఆఫ్‌చేసి లైట్లన్నీ ఆర్పేసి... సెక్యూరిటీవారికి ఆఫీసు తాళాలు అప్పగించి ఇంటిదోవ పడతాడు.

ప్రభుత్వం కారిచ్చినా వాడుకోకుండా తనకి కారు (వెహికల్) వద్దన్నాడు. సిటీబస్సుల్లో రష్ మితిమీరి వుంటుందని ట్రావెల్ చేయడు. ఖర్చు... ఆటోలకు డబ్బు పొయ్యటందేనికంటాడు. ఎంత దూరమైనా నడిచివెళ్ళే అలవాటు, ఇప్పటికీ వుండటంతో చీకటైనా... వెన్నెలైనా... వీధిదీపాలువున్నా... లేకున్నా... కుక్కలు మొరుగుతూ వెంటపడినా... వేళగాని వేళలో వంటరిగా తారసపడ్డందుకు పోలీసు పెట్రోలింగ్ వెహికిల్ ఆపి... నరసింహం ఇచ్చే జవాబు తృప్తికరంగ వుండటంతో... పోలీసు వారి కబంధహస్తాల బారిన పడకుండా... ఎలాగో అలా కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకుంటూంటాడు.

★ ★ ★ ★ ★

నరసింహం దగ్గర దొడ్డిదారిన పన్లు కావు. రికమెండేషన్‌లు చెల్లవ్. కిందవాడెవడైనా మేసేవాడని తెలిస్తే వాడి భరతం పడతాడు. వాడిని ముప్పుతిప్పలు పెట్టి మూడు

చెరువుల నీళ్ళు తాగించేస్తాడు.

ఫైలొచ్చిందంటే... ఎటు జడ్ చదవాల్సిందే! గుడ్డి సంతకాలు పెట్టడు! డిపార్ట్‌మెంట్ రూల్స్‌ని... రోజుకి పదిరకాలుగ వెలువడే జీ.వో.లను కంఠస్తం చేస్తాడు. అర్థరాత్రి నిద్రలో లేపి అడిగినా గడగడా వప్పగించేస్తాడు. ఎవరికే డౌటు వచ్చినా మాన్యువల్ రిఫర్ చేయకుండా... క్లారిఫికేషన్ కొరకు నరసింహాన్నే సంప్రదిస్తూంటారు.

నరసింహం ఎవరినైనా 'రిమూవ్' చేశాడూ అంటే... లేబర్ కోర్టుకే కాదు... హైకోర్టుకెళ్ళినా కేసు వీగిపోయి పిటీషనర్ నెత్తిన తెల్లగుడ్డ వేసుకోకతప్పదు.

పాసైంది స్కూల్ ఫైనలే అయినా... ఇంగ్లీషు భాష మీద మాంచి పట్టున్నవాడు కావటంతో... డిపార్ట్‌మెంటల్ టెస్టులు అతి సునాయాసంగా పాసై.. ఎందరినో ఓవర్‌టేక్ చేసి ఆఫీసరైనాడు!

ఎం.ఏ. చదివినవాడికి సైతం... లీవ్‌లెటర్ స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా రాయటం చేతగానందుకు షేమ్ ఫీలయ్యేట్టు తిడతాడు. భాషరాని వాడు... సరకు లేనివాడు పైకి రాలేడంటూ శాపనార్థాలు పెడతాడు. కమిట్‌మెంట్... వర్క్‌పట్ల డెడికేషన్ లేని వాళ్ళెందుకు ఉద్యోగాలు చేయటం అని నిలదీస్తాడు. మాటలతో ఉరేస్తాడు.

అనుక్షణం కాల్చుకు తినే బాసుగాడి కింద పనిచేయటంకంటే... వీధిలో పల్లీలమ్ముకు బతికినా గౌరవంగ వుంటుందని సబార్డినేట్స్ నిత్యం తిట్టుకుంటూనే వుంటారు. రాచి రంపాన పెట్టే ఈ బాసుగాడి కింద ఎన్నాళ్ళని పని చేయగల మనేసి వాపోతూంటారు.

రోజులు మారుతున్నా... పద్ధతులు మారుతున్నా... కష్టపడి పని చేద్దామనుకునేవారి సంఖ్య తక్కువై జీతం కోసమే ఆఫీసుకెళ్ళి వద్దామనుకునేవారి సంఖ్య ఎక్కువగా కన్పిస్తున్నా... నరసింహంలో మాత్రం... తాను అప్పుడు ఇప్పుడూ ఒకే తీరు! ఆవగింజంతైనా మార్పులేదు.

నరసింహం నిస్వార్థ సేవకుడు! ఆత్మాభిమానం గల ఉద్యోగి. శ్రమజీవి! ఎందరికో మార్గదర్శకుడు.

అయినా ఆయన్ను తిట్టనివాడు... నిందించనివారు వుండరు. అలాంటి రిజిడ్ పర్సన్ దగ్గర పనిచేయటానికి ఎవ్వరు ముందుకురారు. భయపడి చస్తారు. పైరవీ చేసి మరోచోటికి బదిలీ చేయించుకుంటూంటారు.

ఇలాంటి రాక్షసుడితో పాపం భార్య మహాతల్లి మాత్రం ఎన్నేళ్ళుగ ఎలా వేగిందో

ఏమో? కడుపునిండా తిననిచ్చేవాడా?... కంటినిండా నిద్రపోనిచ్చేవాడోలేదోని అందరూ వారిలో వారు కామెంట్ చేసుకోటం పరిపాటి!

ఎందరో మంచి మంచి వారంతా పోతున్నారు! కానీ పాపి చిరాయువు కదా?... ఇలాంటి వాడు అంత త్వరగా పోడు. ఎందరి ప్రాణాలో తీసి గాని రిటైరవటమో... చావటమో గాని జరగదు... మనసులోనే శాపనార్థాలు పెట్టేవారు అనేకులు.

★ ★ ★ ★ ★

పాములను ఆడించేవాడు... సర్పకాటు వలనే మరణించటం... రంగస్థల నటులు... స్టేజీమీదనే ఊపిరి వదలటం... ఎలాగో... బాసుగాడు కూడా ఏ అర్థరాత్రో ఆఫీసులో గల తన ఎ.సి. ఛాంబర్లోనే ఫైళ్లమధ్య హరీ అనకపోడు. సుఖపడే రాతలేని వాళ్ళకి ఇలాగే జరుగుతుంది... అంటూ ఆఫీసులో కొందరి కామెంట్!

మనిషి పేరులోనే వుంది! సగం మనిషి... సగం జంతువు! అన్నీ జంతు లక్షణాలే బాసుగాడిలో. ప్రహ్లాదుడి భక్తికి మెచ్చి వుగ్రనరసింహరూపంలో స్తంభంలోంచి బైటకొచ్చినట్టు... బాసుగాడు ఫైళ్ళమధ్యే పుట్టి ఫైళ్ళమధ్యే పోతాడేమో చివరికి... మరికొందరి శాపనార్థాలు.

నోనోనో... ఇలాంటివాళ్ళు సెంచురీ కొడతారు. నిండు నూరేళ్ళూ బతికి... అవసానదశలో సైతం ఇంట్లో వారిని చెండుకు తినద్దూ?... లాంటి హేళన మాటలు... కామెంట్స్ సబార్డినేట్ స్టాఫ్ మాటల్లో తరచు చోటుచేసుకోవటం మామూలే!

కేబిన్లోంచి ఆఫీసు హాల్లోకి నరసింహం సడన్‌గ ఎంట్రీ ఇవ్వటంతో రకరకాలుగ వాగుతున్న నోళ్ళకి తాళాలు పడ్డయ్. కుక్కిన పేనుల్లా ఎవరి పనుల్లో వారు లీనమైనారు.

★ ★ ★ ★ ★

పదవీ విరమణ రోజున ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున గజమాల శాలువాతో నరసింహాన్ని సత్కరించారు.

బాసుగాడి విశిష్టసేవలను వేనోళ్ళ కొనియాడారు. సబార్డినేట్ స్టాఫ్ మాత్రం బాసుగాడి ముఖాన్నైనా చూడతల్చుకోలేదు. ఆఫీస్ అవర్స్ అయిపోగానే ఎవరి దోవన వారు ఇళ్ళకెళ్ళారు.

తనకు జరిగిన సత్కారానికి బదులుగా లేచి నిలబడి 'నా నలభయ్యేళ్ళ సర్వీసులో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. వైకుంఠపాళి లాంటి సర్వీసులో అన్నీ నిచ్చెనలే ఎక్కాను.

పాములనోట పడలేదంటే... నా కృషి... పట్టుదల... జీతం తీసుకుంటున్నందుకు కష్టపడి పనిచేయాలనే దృఢ సంకల్పం నన్నింత స్థాయికి చేర్చినయ్. ఎందరు ఎన్నిరకాలుగ కామెంట్ చేసినా... చాటుమాటున మాట్లాడుకున్నా నా పద్ధతి విడనాడలేదు. వృత్తే నా దైవం అని నా ప్రగాఢ విశ్వాసం! తెలిసో తెలియకో ఎవరి మనసులనైనా నొప్పించివుంటే క్షమించండి...' అంటూ తన ఉపన్యాసాన్ని క్లుప్తంగ ముగించాడు బాస్ నరసింహం.

నరసింహం చైన్ స్మోకర్ అయినందున కొళ్ళు కొళ్ళు మని దగ్గుతూ... ఊపిరి అందక అపస్మారకస్థితిలో నేలమీద పడిపోయాడు.

అక్కడున్న అధికారులంతా ఆకస్మిక పరిణామానికి కంగారుపడ్డారు. అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు.

★ ★ ★ ★ ★

గలగలా నవ్వుతూ నడుచుకుంటూ వచ్చి తన ఎ.సి. ఛాంబర్లో కూర్చున్నాడు.

బాసుగాడు ఆఫీసుకు రావటం చూచి నివ్వెరపోయారందరూ!

స్టాఫంతా బాసుగాడి ఛేంబర్లోకి జొరబడి అయన్ని వింతగ విచిత్రంగ చూడసాగేరు.

'ఏంటీ?- నేను రిటైరైనట్టు మీరంతా మూకుమ్మడిగా కలగన్నారు కదూ?- నేను చనిపోయినట్టూ కలగని వుంటారు... అవునా?- డోన్ట్‌వర్రీ! నేను పాపాత్ముడ్ని. నాది చిరాయువు! అంత తేలిగ్గా పోను! మీకేం భయంలేదు- బైదిబై... నాకు ఇంకా రెండేళ్ళ సర్వీసుంది. అప్పటివరకూ కష్టమో నిష్ఠూరమో... నన్ను భరించకతప్పదు!- కమాన్ గోగో... వెళ్ళి మీమీ సీట్స్‌లో కూర్చుని వర్క్ స్టార్ట్ చేయండి...' అన్చెప్పిన బాస్ నరసింహం ఫైళ్ళలో తలదూర్చాడు.

స్టాఫంతా అవాక్కై... ఛేంబర్లోంచి బైటికొచ్చి 'ఈ బాసుగాడు... మనందరి చావు చూడనిదే రిటైర్‌కాడు...' అనే భావం అందరి ముఖాల్లోనూ దోబూచులాడింది.

- సమాప్తం -